

వరంగల్ నగర శివారులోని దేశాయిపేట వద్ద నిర్మించిన డబుల్ ఇళ్ల పైపుల దుస్థితి



వరంగల్ నగర శివారులోని దేశాయిపేట వద్ద నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లు



'కల'గానే సొంతిళ్లు!

పంపిణీకి నోచుకోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు

- ఏళ్లతరబడి ఎదురు చూస్తున్న లబ్ధిదారులు
- ఉమ్మడి జిల్లాకు 25,994 ఇళ్లు మంజూరు
- నిర్మాణం పూర్తైనవి 11,049 మాత్రమే
- 5,728 ఇళ్లను పంపిణీ చేయకుండా తాత్సారం
- శిథిలమవుతున్న గోడలు, తలుపులు, కిటికీలు
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా గృహాలు
- వెంటనే పంపిణీ చేయాలని లబ్ధిదారుల ఆందోళనలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల ఆశలు గల్లంతయ్యాయి. కూడు లేకున్నా.. గూడు ఉంటే చాలని ఆశపడిన నిరుపేదలకు నిరాశే మిగులుతోంది. నిర్మాణం పూర్తై ఏళ్లు గడుస్తున్నా అయినా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు పంపిణీకి నోచుకోవటం లేదు. దీంతో సొంతింటి కోసం ఎదురుచూస్తున్న పేదలకు నిరీక్షణ తప్పటం లేదు. డబుల్ ఇళ్లు ఇస్తామని మధ్య దళారులు పేదల నుంచి అందినంతా దండుకున్నారు. అయినా ఇళ్లు రాక.. ఇంటి కోసం ఇచ్చిన డబ్బులు తిరిగి రాక.. పేదల అరిగోస పడుతున్నారు. తమకు డబుల్ ఇళ్లు కేటాయించాలని ఆందోళనకు దిగుతున్నారు.

సొంతింటి కల

పేద ప్రజలకు సొంతింటి కలను నిజం చేసేందుకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను నిర్మించి ఇస్తామని బీఆర్ఎస్ పార్టీ ప్రకటించింది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భవించిన అధికారంలోకి వచ్చిన తర్వాత డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. 2014 నుంచి 2023 వరకు రెండు పర్యాయాలు అధికారంలో ఉన్న బీఆర్ఎస్.. మొత్తంగా ఉమ్మడి వరంగల్ జిల్లాకు 25,994 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు మంజూరు చేసింది. వీటిలో కేవలం 11,049 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు పూర్తి చేశారు. సుమారు ఏడు వేలకు పైగా ఇళ్లు పునాదులు, పిల్లర్లు, రూఫ్ లెవల్ స్థాయిలోనే నిలిచిపోయాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించకపోవటంతో కాంట్రాక్టర్లు మధ్యలోనే గృహ నిర్మాణ పనులను నిలిపివేశారు.

దళారుల వసూళ్లు

డబుల్ ఇళ్ల పేరుతో కొన్నిచోట్ల మధ్య దళారులు భారీగా వసూళ్లు చేసినట్లుగా ప్రచారం జరుగుతోంది. హనుమకొండ, వరంగల్, భూపాలపల్లి జిల్లాలో డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు ఇప్పిస్తానని చెప్పి కొందరు గులాబీ నేతలు, దళారులు పేదల నుంచి ఇంటికి రూ.50వేల నుంచి రూ.5లక్ష వరకు వసూళ్లు చేసినట్లుగా ఆరోపణలున్నాయి. హనుమకొండలోని బాలసముద్రం ప్రాంతంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు భారీగా డిమాండ్ ఉంది. నగరం నడిబొడ్డున ఈ ఇళ్లు ఉండటంతో చాలామంది దళారుల వీటిపైనే దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఇళ్లు ఇప్పిస్తామని రూ.3లక్షల నుంచి రూ.5లక్షల వరకు అనర్హుల నుంచి వసూళ్లు చేసినట్లుగా ఆరోపణలున్నాయి. జనగామ, భూపాలపల్లి, వరంగల్, మహబూబాబాద్ జిల్లాలోనూ ఇలాంటి ఆరోపణలే ఉన్నాయి.

శిథిలావస్థలో..

డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేయకపోవటంతో అవి శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. వరంగల్ జిల్లా దేశాయిపేటలో నిర్మించిన వాటిలో చాలావరకు ఇంటి తలుపులు, కిటికీలు పగిలిపోయాయి. స్లాబ్‌పై నుంచి సిమెంట్ బిచ్చలు రాలుతున్నాయి. హనుమకొండలోని బాలసముద్రంలోని డబుల్ ఇళ్ల పరిస్థితి కూడా శిథిలమై పనికి రాకుండా తయారవుతున్నాయి. ప్రస్తుతం వాటిని మరమ్మతులు చేయాలంటే ప్రతీ ఇంటికి తక్కువలో తక్కువగా రూ.50వేలకు పైగా ఖర్చు వస్తోందని అంచనా. ఖాళీగా ఉండటంవల్ల మరింత శిథిలావస్థకు చేరుకుంటాయని లబ్ధిదారులు అంటున్నారు.

ఆ సాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా..

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల వినియోగంలో

మిగతా 6వ పేజీలో..

ఉమ్మడి జిల్లాలో డబుల్ బెడ్‌రూమ్‌ల పరిస్థితి ఇలా..

జిల్లా	మంజూరైన ఇళ్లు	పూర్తైన ఇళ్లే	పంపిణీ చేసినవి	పంపిణీ చేయనివి
వరంగల్	6,333	2,300	597	1,703
హనుమంకొండ	4,219	2,158	433	1,725
జనగామ	4,393	1,454	670	784
మహ-బాద్	5,567	2,503	1,403	1,100
భూపాలపల్లి	3,882	1,418	1,003	416
ములుగు	1,600	1,215	1,215	00
మొత్తం	25,994	11,049	5,321	5,728



మొక్కలతో నిండిపోయిన అంబేద్కర్ నగర్‌లో నిర్మించిన ఇళ్లు



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న అర్జీదారులు

భూ కబ్జా కేసులే ఎక్కువ

- ప్రజావాణికి వెల్లువెత్తిన ఫిర్యాదులు
- వెంటవెంటనే పరిష్కరించాలన్న కలెక్టర్

జనగామ రూరల్, జూలై 22: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి భూ కబ్జాలపైనే ఎక్కువ ఫిర్యాదులు వచ్చాయి. అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్‌తో కలిసి దరఖాస్తులను స్వీకరించిన కలెక్టర్ రిజ్వాన్ బాషా.. వాటిని వెంటవెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మొత్తం 54 అర్జీలు రాగా వాటిలో రెవెన్యూ శాఖకు సబంధించినవి 45 ఉండగా మిగతా 9 ఇతర శాఖలకు చెందనవి ఉన్నాయి. అయితే వాటి పరిష్కారం కోసం అన్ని మండలాల తహసిల్దార్లకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదుల పట్ల అలసత్వం వహించరాదని, సమస్యలు పెండింగ్‌లో లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, ఆర్డీవోలు కొమురయ్య, వెంకన్న, డీఆర్‌డీవో మొగులప్ప, డీఈవో రాము, డీఎస్‌వో రోజా రాణి, డీడబ్ల్యూవో జయంతి, డీఏవో వినోద్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

భూకబ్జాకు పాల్పడిన వారిని శిక్షించాలి

ఆరనిజ్యోతి మహిళా పరపతి సంఘం, చాగల్లు



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2004లో సీఐఎఫ్ నిధుల నుంచి రూ.6,94,000లు మంజారు చేసింది. వాటితో పల్లగుట్టలో పాడిగేదెల పశు గ్రాసం సాగు చేసేందుకు 30 ఎకరాల భూమి కొనుగోలు చేశాం. అయితే కొంత మంది దళారులతో కలిసి మాజీ సర్పంచ్ పోగుల సారంగపాణి ఆ భూమిని ఆక్రమించుకొని మాపై కేసు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ప్రభుత్వం విచారణ జరిపి మాకు న్యాయం చేయాలి.

ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు..

ధరావత్ దినేష్, గోప్యా తండా, దేవరుప్పుల



మా వ్యవసాయ భూమిని కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్న ప్రభుత్వ అధికారిపై చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీస్ స్టేషన్, తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. 30 సంవత్సరాల క్రితం గోప్య తండా లో మా తాత ధరావత్ దశరథ్ 4 ఎకరాల 12 గుంటల భూమిని కొనుగోలు చేశారు. ప్రస్తుతం ఆ భూమి మా తండ్రి రవీందర్ పేరు మీద ఉంది. ఇపుడు వారిద్దరూ లేరు. ఈ క్రమంలో మా గ్రామానికి చెందిన ధరావత్ దేవేందర్ అనే ప్రభుత్వ ఉద్యోగి మా భూమిలో నీళ్ల ఒడలు నిర్మించి కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నాడు. ప్రభుత్వం పూర్తి విచారణ జరిపి మాకు న్యాయం చేయాలి.

దుర్గానగర్ కాలనీలో వీధి లైట్లను ఏర్పాటు చేయాలి..

ఉమారాణి, బతుకమ్మ కుంట, జనగామ



జిల్లా కేంద్రంలోని దుర్గానగర్(బతుకమ్మ కుంట)లో స్ట్రీట్ లైట్లను ఏర్పాటు చేయాలి. జనగామ మున్సిపాలిటీ అనుమతితో కొన్ని సంవత్సరాల క్రితం దుర్గానగర్ కాలనీలో ఇండ్లను నిర్మించుకున్నాం. అధికారులకు ఇంటి పన్ను, ఇతర పన్నులను చెల్లిస్తున్నాం. అయినా మా కాలనీకి కరెంట్ పోల్స్ ఏర్పాటు చేయడం లేదు. స్ట్రీట్ లైట్లు లేకపోవండతో కాలనీ వాసులు రాత్రి పూట బయటకు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతంలో పాములు, తేళ్లు, ఇతర విష పురుగులు ఎక్కువ తిరుగుతున్నాయి. వెంటనే అధికారులు స్పందించి స్తంభాలు వేసి లైట్లు ఏర్పాటు చేయాలి.

తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలి

అట్ల రాజు, నమిలిగొండ



నేను ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ కోసం 2022లో సవరించిన జీవో ప్రకారం స్టేషన్ ఘన్‌పూర్ తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నాను. ఇప్పటివరకు సర్టిఫికెట్ ఇవ్వకుండా రకరకాల కారణాలతో ఇబ్బందిపెడుతున్నారు. తనకు సర్టిఫికెట్ లేకపోవడంతో పీహెచ్‌డీ, ఎల్ఎల్‌బీ సీట్, గ్రూప్4, జేఎల్ పరీక్షలలో ఉద్యోగ అవకాశాలు కోల్పోయాను. ఈ విషయంలో విచారణ జరిపింది. సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలి.

జఫర్‌గడ్ ఎస్ఐ సస్పెన్షన్

- భూ వివాదంలో నిందితులకు సహకారం
- విచారణ చేసి వేటు వేసిన సీపీ



రవి యావవ్

వరంగల్ క్రైం/జఫర్‌గడ్, జూలై 22: జఫర్‌గడ్ ఎస్ఐ ఎస్.రవియాదవ్‌పై సస్పెన్షన్ వేటు వేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కిందటేడు జఫర్‌గడ్ పోలీసుస్టేషన్‌లో నమోదైన స్థల వివాదానికి సంబంధించిన కేసులో ఎస్ఐ రవి నిందితులకు సహకరించినట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో సీపీ విచారణ చేయించారు. ఉన్నతాధికారులను సైతం తప్పుదోవ పట్టించడంతో పాటు స్థలానికి సంబంధించి తప్పుడు పత్రాలు సృష్టించడంలోనూ ఎస్ఐ సహకరించినట్లు తేలింది. ఈ కేసుతో పాటు పలు కేసుల్లోనూ అధికారులను తప్పుదోవ పట్టిస్తూ అవకతవకలకు పాల్పడినట్లు నిర్ధారణ అయింది. ఈ మేరకు ఎస్ఐ రవిని పోలీస్ కమిషనర్ సస్పెండ్ చేశారు.

దరఖాస్తుదారుల సమస్యలు పరిష్కరిస్తాం

అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్

పాలకుర్తి, జూలై 22: గత జనవరిలో ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్నవారందరికీ న్యాయం చేస్తామని, వారి సమస్యలు పరిష్కరిస్తామని అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ అన్నారు. సోమవారం ఆయన పాలకుర్తి ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాపాలన సేవా కేంద్రాన్ని పరిశీలించారు. రోజుకు ఎన్ని తప్పులు సవరణ చేస్తున్నారు, వాటిలో నాట్ మ్యాచ్‌గా ఉన్న దరఖాస్తులు ఎన్ని సవరించారు, నాట్ అప్లైడ్ లాంటివి ఎన్ని దరఖాస్తులు ఉన్నాయి అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. అనంతరం బమ్మెర, తొర్రూరు ఉన్నత పాఠశాలలను సందర్శించారు. అమ్మ ఆదర్శ కమిటీలతో సమావేశమ య్యారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని ఆదేశించారు. ఆయన వెంట డీఈవో రాము, ఎంపీడీవో రాములు, ఎంఎన్‌వో పోతుగంటి నర్సయ్య ఉన్నారు.



ప్రజాపాలన సేవా కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్

రుణమాఫీ జాబితాను ప్రకటించాలి

రుణమాఫీ పొందిన రైతుల జాబితాను గ్రామ పంచాయతీ నోటీస్ బోర్డుపై అంటించాలని అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. సోమవారం ఆయన పాలకుర్తి ఏపీజీవీబీ బ్రాంచిని సందర్శించి ఆ బ్యాంక్ మేనేజర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.1 లక్ష లోపు రుణమాఫీ జరిగిన ప్రతీ రైతు ఖాతాలను రెన్యూవల్ చేయాలని ఆదేశించారు. రైతుల సందేహాలను నివృత్తి చేయడం కోసం ప్రతీ బ్యాంక్‌లో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఆయన వెంట ఏడీఏ పరశురామ్ నాయక్, ఎంపీడీవో రాములు, ఏఈవోలు వెంకటేష్, సంధ్య ఉన్నారు.

రుణమాఫీపై వదంతులు నమ్మొద్దు

- మల్కాపూర్ ఇండియన్ బ్యాంకు మేనేజర్ గోన గోపిరాజు



చిలుపూర్, జూలై 22 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న రైతు రుణమాఫీకి సంబంధించి వస్తున్న వదంతులను ఎవరూ నమ్మొద్దని, అర్హులైన ప్రతీ రైతుకు రుణమాఫీ వర్తిస్తుందని మల్కాపూర్ ఇండియన్ బ్యాంకు మేనేజర్ గోన గోపిరాజు స్పష్టం చేశారు. సోమవారం ఆయన మల్కాపూర్‌లో మాట్లాడారు. ఇండియన్ బ్యాంకు పరిధిలో మొత్తం 2982 మంది రైతులకు పంటరుణాలు ఉండగా, వారిలో రూ 1 లక్ష లోపు 876 మంది, రూ 1.50 లక్షల లోపు 813మంది, రూ.2 లక్షల లోపు 1087 మంది, రూ2 లక్షల పైన 206 మంది రైతులు రుణాలు కలిగి ఉన్నారని వివరించారు. అయితే ఇండియన్ బ్యాంకు పరిధిలో రాష్ట్ర వ్యాప్తంగా నెలకొన్న సాంకేతిక సమస్య కారణంగానే కొంత ఆలస్యం జరిగిందని, రైతులు ఆందోళన చెందవద్దని సూచించారు.

అలిగి వచ్చిన మహిళ

- కుటుంబ సభ్యులకు అప్పగించిన పోలీసులు

స్టేషన్‌ఘన్‌పూర్, జూలై 22: భర్తతో గొడవపడి అలిగి వచ్చిన మహిళను స్టేషన్‌ఘన్‌పూర్ రైల్వే పోలీసులు గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఘన్‌పూర్ జీఆర్పీఎఫ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ జగద్గిరిగుట్టకు చెందిన 26 ఏళ్ల మహిళ సోమవారం ఇంట్లో భర్తతో గొడవపడి సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు వచ్చింది. అప్పుడే కదులుతున్న గోల్కొండ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కింది. ఓ ప్రయాణికుడి ఫోన్ తీసుకొని భర్తకు ఫోన్ చేసి "నేను వెళ్లిపోతున్నాను, నా గురించి వెతకవద్దు" అని చెప్పి ఫోన్ పెట్టేసింది. వెంటనే భర్త అదే నంబర్‌కు ఫోన్ చేసి అది ఏ రైలు, ఎటు వెళుతోంది, ప్రస్తుతం ఎక్కడి వరకు చేరింది తదితర విషయాలు తెలుకొని సికింద్రాబాద్ జీఆర్పీ కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాడు. వారు జనగామ జీఆర్పీ పోలీసులకు సమాచారం ఇచ్చారు. మధ్యాహ్నం 2గంటలకు జనగామలో డీ-3 బోగిలో వెతకగా మహిళ కనిపించలేదు. దీంతో వారు ఘన్‌పూర్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వెంటనే రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. మధ్యాహ్నం 2:20 గంటలకు ఘన్‌పూర్‌లో ఆమె రైలుదిగి బయటకు వస్తుండగా పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అప్పటికే బాధితురాలి కుటుంబసభ్యులు రైలును ఫాలో అవుతూ ఘన్‌పూర్‌కు చేరుకున్నారు.

పోలీసులు సదరు మహిళను వారికి అప్పగించడంతో కథ సుఖాంతమైంది. మహిళను వెతికిపట్టుకున్న వారిలో జీఆర్పీ ఎస్సై మోహినుద్దీన్, హెడ్ కానిస్టేబుల్ రమణారెడ్డి, కానిస్టేబుల్ సుదర్శన్, ఘన్‌పూర్ పోలీసులు జి.కుమారస్వామి, ఎస్. శ్రీనివాస్ ఉన్నారు.

- వయసు, విద్యతో సంబంధం లేదు

అందరూ అర్హులే

'ఇంటింటా ఇన్నోవేటర్' వేదికగా నూతన ఆలోచనలకు ఆహ్వానం



ఇంటింటా ఇన్నోవేటర్ ప్రచార లోగో

- ఆడియో, వీడియో రూపంలో ప్రాజెక్టు ఉండాలి
- 9100678543 నంబరుకు వాట్సాప్ చేయాలి
- ఏదైనా సమస్యకు పరిష్కారం చూపించాలి
- దరఖాస్తులు పంపేందుకు గడువు ఆగస్టు 3
- 15వ తేదీన జిల్లా కేంద్రంలో ఎగ్జిబిట్ల ప్రదర్శన
- ఎంపికైన ఆవిష్కరణలకు బహుమతులు
- ఉత్పత్తి, మార్కెటింగ్‌కు సర్కారు ప్రోత్సాహం

జఫర్‌గడ్, జూలై 22 : ప్రతీ ఒక్కరిలో ఏదో ఒక ప్రతిభ దాగి ఉంటుంది. దాన్ని వెలికితీయడమే 'ఇంటింటా ఇన్నోవేటర్' కార్యక్రమ ఉద్దేశం. స్థానిక సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నూతన ఆవిష్కరణలకు అవకాశం ఇచ్చేందుకు ప్రభుత్వం ఏటా ఈ కార్యక్రమం నిర్వహిస్తోంది. స్వాతంత్ర్యదినోత్సవాన్ని పురస్కరించుకుని అన్ని వర్గాల ప్రజలను భాగస్వామ్యం చేస్తూ.. తెలంగాణ రాష్ట్ర ఇన్నోవేషన్ సెల్ ఆధ్వర్యంలో 2019 నుంచి ఈ పోటీలను నిర్వహిస్తోంది. వయసు, విద్యతో సంబంధం లేకుండా ఇందులో సామాన్య గృహిణి నుంచి అన్నదాతలు, విద్యావేత్తలు, వ్యాపారులు, ఉద్యోగులు, మెకానిక్‌లు, మహిళలు, పాఠశాల, కళాశాల విద్యార్థులతో పాటు ఎవరైనా పాల్గొనవచ్చు. వారు తయారు చేసే ఎగ్జిబిట్లు ఏదైనా ఒక సమస్యలకు పరిష్కారం చూపేలా ఉండాలి. ఆసక్తిగల వారి నుంచి కలెక్టర్ నేతృత్వంలో 2024-25 సంవత్సరానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. దరఖాస్తుల స్వీకరణకు ఆగస్టు 3 చివరి తేదీ. ఈ నూతన ఆవిష్కరణలను ఆగస్టు 15న కలెక్టరేట్‌లో జరిగే స్వాతంత్ర్య వేడుకల్లో ప్రదర్శిస్తారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఆవిష్కరణలు..

ఈ పోటీల్లో ఎవరైనా పాల్గొని తమ నూతన ఆలోచనల ఆవిష్కరణలను ప్రదర్శించవచ్చు. అయితే ఈ ఆవిష్కరణలు మన పరిసరాలు, ఇళ్లు, విద్యాలయాలు, వ్యవసాయం, వంటి ఇతర సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా ఉండాలి. ఇప్పటికే ఉన్న వస్తువుల్లో కొన్ని మార్పులు చేసి కొత్త ఆవిష్కరణలు కూడా రూపొందించవచ్చు. అతి తక్కువ ఖర్చుతో ప్రజలకు ప్రయోజనకరంగా ఉండాలి. రూపొందించే ఆవిష్కరణ అందరి మెప్పు పొందేలా ఉండాలి. ఉన్న పరికరాలను వినూత్నంగా తయారు చేయడం, కొత్త ఆలోచనలను జోడించి వాటి ప్రయోజనాలు విస్తృతం చేయడం వంటివి ఆవిష్కరణలో చూపాలి. అలాంటి ఆవిష్కరణలను ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది. ఏ సమస్యపై మీరు పరిష్కారం కనుగొన్నారో ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలను తెలంగాణ ఇన్నోవేషన్ సెల్‌కు పంపించాలి.



ఇంటింటా ఇన్నోవేటర్ వాల్‌పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా, ఇతర అధికారులు (ఫైల్)



వాట్సాప్ ద్వారా...

ఆసక్తి ఉన్న వారు ఆలోచనలకు అనుగుణంగా తయారు చేసిన ప్రాజెక్టులను సులభంగా పంపించే సౌలభ్యం కల్పించారు. వివరాలను 9100678543 అనే నంబరుకు వాట్సాప్ ద్వారా ఆగస్టు 3వ తేదీ లోగా పంపించాలి. ఆవిష్కర్తలు తమ పేరు, ఆవిష్కరణ పేరు, దాని గురించి ఆరు వాక్యాలు (వంద పదాలు), రెండు నిమిషాల నిడివి ఉన్న వీడియో, ఆవిష్కరణకు సంబంధించిన నాలుగు ఫొటోలు, రూపొందించిన వారి పేరు, మొబైల్ నంబరు, ప్రస్తుత వృత్తి, పూర్తి చిరునామాను వాట్సాప్ ద్వారా తెలియజేయాలి. వచ్చిన దరఖాస్తులలో ఉత్తమమైన వాటిని ఎంపిక చేసి జిల్లా కేంద్రంలో జరిగే స్వాతంత్ర్య వేడుకల రోజున వారికి ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేస్తారు. ఆవిష్కర్తలు రూపొందించిన పరికరాలు సమాజానికి ఉపయోకరంగా ఉంటే భవిష్యత్తులో వారికి పేటెంట్ హక్కుతో పాటు మార్కెటింగ్ చేసుకోవడానికి ప్రభుత్వం అనుమతిస్తుంది. ఆర్థిక సాయం అందించి వాటిని ఉత్పత్తి చేసేలా ప్రోత్సహం కూడా అందిస్తుంది.

సద్వినియోగం చేసుకోవాలి..

రఘునందన్, జిల్లా సైన్స్ అధికారి



ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమంలో అందరూ భాగస్వామ్యం కావాలి. ఆయా గ్రామాల్లో నెలకొన్న సామాజిక సమస్యలకు పరిష్కారం కనుగొనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. నూతన ఆలోచనలు, ఆవిష్కరణలకు మంచి వేదిక ఇన్నోవేటర్. యువత, రైతులు, కార్మికులు, విద్యార్థులు, మహిళలు, మెకానిక్‌లు.. ఇలా అన్ని వర్గాల వారు పాల్గొనవచ్చు. పరిష్కారం చూపే ఏ ప్రయోగ ఆవిష్కరణను అయినా పోటీకి పంపించవచ్చు. ఉత్తమమైన వాటిని ఎంపిక చేసి స్వాతంత్ర్యదినోత్సవం రోజున ప్రశంసాపత్రాలు, బహుమతులను అందజేస్తారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

ఆవిష్కర్తలకు మంచి అవకాశం..

కళ్యాణి, ఇన్నోవేషన్ సెల్ జిల్లా కో-ఆర్డినేటర్

వినూత్నంగా ఆలోచించే వారికి ఇన్నోవేటర్ మంచి వేదిక. నూతన ఆవిష్కరణలు, పోటీలపై అన్ని మండలాల్లో అవగాహన కల్పిస్తున్నాం. పోస్టర్లు, కరపత్రాల ద్వారా వివరిస్తూ చైతన్యపరుస్తున్నాం. ఆవిష్కరణల సంఖ్య పెంచి వాటిని రూపొందించే వారిని ప్రోత్సహించేందుకు కలెక్టర్ పర్యవేక్షణలో కృషి చేస్తున్నాం. ఆగస్టు 3వ తేదీ లోపు తగు వివరాలతో దరఖాస్తులను వాట్సాప్ ద్వారా పంపించాలి.



హనుమకొండ అంబేద్కర్ నగర్‌లో పూర్తయిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు

'కల'గానే సొంతిళ్లు!

(5వ పేజీ తరువాయి)

లేకపోవటంతో అసాంఘిక కార్యాకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి. సాయంత్రం వేళల్లో మందు బాబులకు అడ్డాగా మారుతున్నాయి. పంచాయతీలు, సెటిల్‌మెంట్‌లకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లనే వాడుతున్నారు. వరంగల్ నగర శివారులోని దూపకుంట ప్రాంతంలో గంజాయి, డ్రగ్స్‌లాంటి వాటిని తీసుకునేందుకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను వినియోగిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. వ్యభిచారాలకు కూడా వాడుకుంటున్నారనే చర్చ ఉంది. ఈ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు రక్షణ లేకపోవటంతో ఇష్టారాజ్యంగా వాటిని వినియోగించుకుంటున్నారనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

లబ్ధిదారుల ఆందోళనలు



హనుమకొండ అంబేద్కర్ నగర్‌లో ఆదివారం డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల తాళాలు పగులగొట్టిన లబ్ధిదారులు

హనుమకొండలోని బాలసముద్రం ఇళ్లను పంపిణీ చేయాలని లబ్ధిదారులు ఆదివారం రాత్రి ఆందోళనకు దిగారు. నిర్మాణం పూర్తైన ఇళ్లలోకి వెళ్లటంతో పోలీసులు జోక్యం చేసుకోవల్సి వచ్చింది. అలాగే భూపాలపల్లి పట్టణంలోని 430 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు లబ్ధిదారులకు కేటాయించాలని గత నెలలో నాలుగు రోజులు ఆందోళనకు దిగారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు డివిజన్‌లో నిర్మించిన 712 ఇళ్లు పేదలకు పంపిణీ చేయాలని కలెక్టర్‌ను కలిసి స్థానికులు విజ్ఞప్తి చేశారు. జనగామ జిల్లా పాలకుర్తి మండలం గూడూరులో 70 ఇళ్ల నిర్మాణం పూర్తి కాగా, వాటిని పంపిణీ చేయకపోవటంతో 40ఇళ్లలో తలుపులు తీసుకుని స్థానికులు నివాసం ఏర్పాటుకు ప్రయత్నించారు. వారంలో గ్రామసభ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేస్తామని హామీ ఇచ్చి దాటవేశారు. ఇలా ఉమ్మడి వ్యాప్తంగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఖాళీగా ఉండటంతో వాటిని తమకు కేటాయించాలని లబ్ధిదారులు ఆందోళన బాట పడుతున్నారు. ప్రభుత్వం వెంటనే పంపిణీ చేయాలని లబ్ధిదారులకు డిమాండ్ చేస్తున్నారు.

దివ్యాంగులకు రిజర్వేషన్ కల్పించాలి

ఐఏఎస్ స్మితా సభర్వాల్‌పై చర్యలు తీసుకోవాలి

వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్



ఇల్లందలో కండ్లకు గంతలు కట్టి నిరసన వ్యక్తం చేస్తున్న దివ్యాంగులు

వర్ధన్నపేట రూరల్, జూలై 22: రాష్ట్రంలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో దివ్యాంగులకు రిజర్వేషన్ కల్పించాలని వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని ఇల్లందలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సివిల్స్‌లో దివ్యాంగులకు రిజర్వేషన్లు అవసరమా? అంటూ అనుచిత వ్యాఖ్యలు చేసిన సీనియర్ ఐఏఎస్ స్మితా సభర్వాల్‌పై సీఎం రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దివ్యాంగులకు ఉన్న హక్కులను, చట్టాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయకుండా, దివ్యాంగుల సమాజాన్ని అడుగడుగునా విస్మరిస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల్లో పోటీ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే భారత వికలాంగుల సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం స్మితా సభర్వాల్ వ్యాఖ్యలకు నిరసన కండ్లకు నల్లగంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కావలి నర్సింహులు, రాష్ట్ర మహిళా నాయకురాలు గుడపల్లి సుమతి, మండల అధ్యక్షుడు జట్టబోయిన శ్రీనివాస్, రాయపర్తి మండల అధ్యక్షుడు ఇస్లావత్ బాలకృష్ణ, నల్గొండ జిల్లా అధ్యక్షుడు చిన్నపాక మత్స్యగిరి, నాయకులు షారుఖ్, వెంకన్న, ముత్తయ్య, రమేష్, హరీఫ్ పాల్గొన్నారు.

వర్సిటీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



రిజిస్ట్రార్ మల్లారెడ్డికి వినతి పత్రాన్ని ఇస్తున్న ఉద్యోగసంఘం నేతలు

కేయూ క్యాంపస్, జూలై 22: వర్సిటీలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని కేయూ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ప్రొఫెసర్ ఈసం నారాయణ, డాక్టర్ పుల్లా శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డిని కలిసి తమసమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2013లో నియమితులైన బోధనేతర ఉద్యోగులందరికీ పే రివిజన్ జీతాలు ఇవ్వాలని, 2010లో నియమితులైన బోధన ఉద్యోగులను క్రమబద్ధీకరించా లని కోరారు. ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని అన్నారు. ఏఆర్, సూపరింటెండెంట్, ల్యాబ్ అసిస్టెంట్, టెక్నీషియన్-2, ఎలక్ట్రికల్ సూపర్‌వైజర్, రికార్డు అసిస్టెంట్, బుక్ కీపర్ ఉద్యోగాలకు ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. వర్సిటీలో పనిచేస్తున్న రెగ్యులర్, కాంట్రాక్టు ఉద్యోగులకు రెగ్యులర్ చేయాలని అన్నారు. పీహెచ్‌డీ పూర్తిచేసిన ఉద్యోగులకు కోర్సు కోఆర్డినేటర్‌గా ప్రమోట్ చేయాలన్నారు. 2013 టెస్ట్ కోటా మేరకు జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగాలివ్వాలని పేర్కొన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఎస్డీఎల్ఈసీ డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, బొక్క మొగిలి, దామెర ప్రభాకర్, నమిండ్ల కిరణ్‌కుమార్, బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

కేయూ ఇంజనీరింగ్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా మహేందర్

కేయూ క్యాంపస్, జూలై 22: కాకతీయ యూనివర్సిటీ కోఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా డాక్టర్ వేశాల మహేందర్ బాధ్యతలు చేపట్టారు. మహేందర్ ఇప్పటి ప్రిన్సిపాల్‌గా ఉన్న ప్రొఫెసర్ మంచాల సదానందం స్థానంలో విధులు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా కోఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాల అసిస్టెంట్ రిజిస్ట్రార్ నేతాజీ, సూపరింటెండెంట్ బొల్లెపాక ప్రభాకర్ నేతృత్వంలో ప్రిన్సిపాల్ మహేందర్‌కు పుష్పగుచ్ఛం అందచేసి శుభాభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పి.సదాశివుడు, డాక్టర్ సంగాల ఎఫ్రామ్‌రాజ్, ఆనంద్, బి.శోభారాణి, మంద శ్యాం, పున్నం చందర్, పి.గౌతమి తదితరులు పాల్గొన్నారు.



మహేందర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న కళాశాల సిబ్బంది

ఆర్టీసీ అధికారులపై సస్పెన్షన్ వేటు

బాలసముద్రం, జూలై 22: వరంగల్ రిజీయన్ పరిధిలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న అకౌంట్ ఆఫీసర్ లావణ్యను ఆర్టీసీ ఉన్నాతాధికారులు సోమవారం సస్పెండ్ చేశారు. వరంగల్‌లో లావణ్య అద్దె బస్ ఓనర్ల నుంచి, ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టర్లను వేధించడం, పెన్షనర్ల సెటిల్‌మెంటుకు డబ్బులు డిమాండ్ చేసిన ఆరోపణలపై విజిలెన్స్ డిపార్టుమెంట్ ఎంక్వైరీ చేశారు. ఈ నివేదిక అందుకున్న ఆర్టీసీ ఉన్నాతాధికారులు ఏవో లావణ్యను సస్పెండ్‌చేసినట్లు సోమవారం తెలిపారు. ఏవో లావణ్యకు సహకరించాడని అసిస్టెంట్ మేనేజర్‌గా ఫైనాన్స్ ఏవోగా ప్రమోషన్‌పై రంగారెడ్డి జిల్లాకు వెళ్లిన రాంమోహన్‌ను సైతం సస్పెండ్ చేసినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.

28 నుంచి కేయూ దూరవిద్య పీజీ కోర్సుల తరగతులు

కేయూ క్యాంపస్, జూలై 22: కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం 2023-24 ఏడాది ఎంఏ పొలిటికల్ సైన్స్, సోషియాలజీ, ఇంగ్లీష్, ఎంకామ్ కోర్సుల ప్రథమ ఏడాది ప్రథమ సెమిస్టర్, రెండో ఏడాది కాంట్రాక్టు తరగతులు నిర్వహిస్తామని దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేయూ దూరవిద్య కేంద్రంలో జరిగే తరగతులను అభ్యర్థులందరూ హాజరు కావాలని కోరారు. మిగతా కోర్సుల కాంట్రాక్టు తరగతులను వివరాలను త్వరలోనే ప్రకటిస్తామని వెల్లడించారు.

రెడ్‌క్రాస్ కమిటీలో కొత్త వారికి అవకాశం

ఆరేళ్లు దాటితే తప్పుకోవాల్సిందే : గవర్నర్ ఆదేశాలు

వరంగల్ మెడికల్, జూలై 22: రాష్ట్రవ్యాప్తంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కమిటీల్లో కొత్తవారికి అవకాశం కల్పించాలని రాష్ట్ర గవర్నర్ ఆదేశించారు. ఈ మేరకు రాజ్‌భవనన్ నుంచి తాజాగా లేఖ నెంబర్ 681/టి2/ఎస్/2024 విడుదలైంది. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కమిటీల్లో కీలక బాధ్యులుగా ఎన్నికై ఆరేళ్లకు పైగా కానీ, రెండు విడతలుగా కానీ కొనసాగుతున్న వారు ఇకపై స్వచ్ఛందంగా తప్పుకోవాల్సిందేనని లేఖలో పేర్కొంది. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీకి రాష్ట్ర స్థాయిలో గవర్నర్ అధ్యక్షుడిగా వ్యవహరిస్తారు. జిల్లా కమిటీలో 10 నుంచి 15 మంది వరకు సభ్యులుంటారు. ఇందులో కీలక పదవుల్లో ఉన్న రాష్ట్ర కమిటీ సభ్యుడు, జిల్లా అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, కార్యదర్శి, కోశాధికారి ఆరేళ్లు పూర్తి చేసుకున్న, రెండు విడతల పదవీ పూర్తిచేసుకున్న వారు వెంటనే స్వచ్ఛందంగా రాజీమానా చేయాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

రేసులో ముగ్గురు

హనుమకొండ జిల్లా రెడ్‌క్రాస్‌సొసైటీ చైర్మన్‌గా డాక్టర్ విజయచందర్‌రెడ్డి చాలా ఏళ్లగా పని చేస్తున్నారు. గవర్నర్ లేఖతో ఆయన స్వచ్ఛందంగా తప్పుకుంటే ఈ పదవికోసం ముగ్గురు పోటీ పడుతున్నారు. డాక్టర్ శేషు మాధవ్, డాక్టర్ హరి సంధ్యారాణి, పెద్ది వెంకట నారాయణగౌడ్ పోటీ పడుతున్నారు.

నిజాం నిరంకుశ పాలనను ఎదురించిన ధీశాలి దాశరథి

దాశరథి రచనలు తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తి : ఎమ్మెల్సీ, కవి దేశపతి శ్రీనివాస్



మహబూబాబాద్‌లో జరిగిన సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ, కవి దేశపతి శ్రీనివాస్

మహబూబాబాద్ టౌన్, జూలై 22: నిజాం నిరంకుశ పాలనను ఎదిరించి పేదల పక్షాన నిలిచి కవిత్వాన్ని రాసిన మహాకవి దాశరథి ఆశయాలను ముందుకు తీసుకుపోవాల్సిన అవసరం మనందరిపై ఉందని ఎమ్మెల్సీ, కవి దేశపతి శ్రీనివాస్ అన్నారు. దాశరథి జయంతిని పురస్కరించుకుని మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఎస్వీఎం ఫంక్షన్ హాల్‌లో సోమవారం దాశరథి శత జయంతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శత జయంతి సభ నిర్వహించారు. ఈసందర్భంగా ఉత్సవ కమిటీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్‌రావు అధ్యక్షతన నిర్వహించిన సభలో ముఖ్యవక్తగా హాజరైన ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ మాట్లాడారు. దాశరథి తన 20వ ఏటనే పోరాటాల బాట పట్టి నిరంకుశ పాలన సాగిస్తున్న నిజాం నవాబును ఎదిరించారని చెప్పారు. నిజామాబాద్ జైలులో బంధిస్తే అక్కడ బొగ్గు ముక్కతో ఓ నిజాం పిశాచమా అంటూ రాసి ఉద్యమాన్ని రగిల్చిన గొప్ప వ్యక్తి దాశరథి అని కొనియాడారు. జైలులో బంధించినప్పటికి సింహాలా గర్జించారని గుర్తుచేశారు. ఆయన ప్రజల కోసమే కవిత్వం రాసేవారని, తన రచనలు తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తిగా నిలిచాయని పేర్కొన్నారు. దాశరథి అంటేనే తెలంగాణ... తెలంగాణ అంటేనే దాశరథి అని తెలంగాణ అస్థిత్వాన్ని తన కవిత్వంలో చూపించారని పేర్కొన్నారు. భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడుతూ సమాజంలో దుర్మార్గం, వెట్టిచాకిరి విముక్తి తన కర్తవ్యంగా పనిచేశారని తెలిపారు. ప్రజా కవులు దాశరథి, కాళోజీల జీవిత చరిత్రలు చదివితే తెలంగాణ గూర్చి తెలుస్తుందని, సరళమైన పదాలతో అందరికి అర్థమయ్యే రీతితో దాశరథి కవిత్వం ఉండేదన్నారు. ఆంగ్ల కవి షేక్స్‌పియర్ కంటే గొప్ప కవి దాశరథి అన్నారు.

ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్ మాట్లాడుతూ.. ప్రజల కష్టాలు, జీవితాలు ప్రతిబింబాలుగా దాశరథి కవిత్వం ఉండేదని, ఆయన దేశం గర్వించదగ్గ కవి అని కొనియాడారు. ప్రజలను చెడు మార్గంలోకి వెళ్లకుండా సన్మార్గంలో నడిపించేది కవిత్వమని, దాశరథి గొప్ప మేధావి అని, ఆయన పుట్టిన గడ్డలో తాను ఎమ్మెల్యేగా పనిచేయడం అదృష్టమని చెప్పారు. దాశరథి సంపద పుస్తకాలేనని అలాంటి మహనీయుడిని ప్రజల్లోకి తీసుకువెళితే తెలుగును బతికించుకున్న వారమవుతామని తెలిపారు. నా తెలంగాణ కోటి రతనాల వీణ స్వరాష్ట్ర ఉద్యమానికి ఊతమిచ్చిందని చెప్పారు.

ప్రముఖ కవి, తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షుడు నందిని సిధ్ధారెడ్డి మాట్లాడుతూ.. దాశరథి మన మధ్య లేకపోయినా జ్ఞాపకాలు మిగిలే ఉన్నాయని అన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో దాశరథి శత జయంతి ఉత్సవాలు జరగాలని ఆకాంక్షించారు. జాగీరు దారులకు వ్యతిరేకంగా గర్జిస్తూ ప్రజల కోసం.. పాలకులను ప్రశ్నిస్తూ తన కవితలను రాసిన మహా కవి దాశరథి అని తెలిపారు. టీఎస్టీవోస్ పూర్వ అధ్యక్షుడు దేవీప్రసాద్ మాట్లాడుతూ.. దాశరథి పోరాట వారసత్వాన్ని ఈ సమాజానికి అందించాలన్నారు. టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ మాట్లాడుతూ.. ప్రజల కోసం తన జీవితాన్ని ఫణంగా పెట్టి నిజాం నవాబును ధిక్కరించిన కవి దాశరథి అని చెప్పారు. చిన్నగూడూరుకు దాశరథి మండలంగా పేరు పెట్టాలని కోరారు. ఎమ్మెల్సీ, దాశరథి శత జయంతి ఉత్సవ కమిటీ జిల్లా అధ్యక్షుడు తక్కెళ్లపల్లి రవీందర్‌రావు మాట్లాడుతూ.. దాశరథిని స్మరించుకుంటూ ఆయన జీవిత చరిత్రను భావితరాలకు అందిస్తూ ఆశయాలను ముందుకు తీసుకుపోవాలని చెప్పారు. జిల్లాలో సంవత్సర కాలం పాటు దాశరథి జయంతి ఉత్సవాలను జరిపి ముగింపు సభను జిల్లా కేంద్రంలో పెద్ద ఎత్తున నిర్వహిస్తామని స్పష్టం చేశారు. అనంతరం సభకు హాజరైన వక్తలు, అతిథులను శాలువాలతో సత్కరించి మెమోంటోలను అందజేశారు. చివరగా కవి సమ్మేళనాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, టీయూడబ్ల్యూజే రాష్ట్ర నాయకులు అడ్డగోడ రాజేష్, ఉత్సవ కమిటీ చిన్నగూడూరు మండల అధ్యక్షుడు గునిగంటి కమలాకర్, కవి గుర్రపు సత్యనారాయణ, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ డాక్టర్ నాగవాణి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు యలమంచిలి వెంకటేశ్వర్‌రావు, బానోత్ రవికుమార్, ఎడ్ల వేణు, కొండపల్లి కరుణాకర్‌రెడ్డి, కన్న, జెరిపోతుల వెంకన్న, కవులు, దాశరథి అభిమానులు పాల్గొన్నారు.

గాయని సనశ్రీకి రికార్డుల పంట



సనశ్రీకి రికార్డుల పత్రాలను అందజేస్తున్న నిర్వాహకులు

హనుమకొండ కల్చరల్, జూలై 22: నగరానికి చెందిన ప్రముఖ గాయని సనశ్రీ తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషలలో ఏకధాటిగా 8 గంటల పాటు 108 పాటలను ఆహుతుల సమక్షంలో ఆలపించి ప్రశంసలు అందుకుంది. అంతేగాక తెలుగు బుక్‌ఆఫ్ రికార్డు, తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డు, ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డులలో సనశ్రీ పేరును నమోదు చేసుకోవడం విశేషం. ఈ అపూర్వ కార్యక్రమానికి హనుమకొండలోని వాగ్దేవి కళాశాల ఆడిటోరియం వేదికగా నిలిచింది. ఆదివారం రాత్రి బాగా పొద్దుపోయే వరకు జరిగిన ఈ కార్యక్రమంలో అనేక మంది ప్రముఖులు పాల్గొని సనశ్రీని ప్రశంసలతో ముంచెత్తారు. కాకతీయ మ్యూజికల్ క్లబ్ వ్యవస్థాపకుడు రంగు రఘుపతి ఆధ్వర్యంలో జరిగిన ఈ అపూర్వ వేడుకలను ఉదయం ప్రముఖ సంగీత విద్వాంసుడు ఆచార్య తిరుపతయ్య లాంఛనంగా ప్రారంభించగా నగరానికి చెందిన అనేక మంది ప్రముఖులు పాల్గొని కార్యక్రమాన్ని తిలకించి గాయని సనశ్రీని అభినందించారు. ఈ అవార్డులను జ్యూరీ మెంబర్ టీవీ అశోక్ కుమార్ హాజరై అందజేశారు.



మీడియా సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఏసీసీ దేవేందర్‌రెడ్డి

ఇద్దరు ఏటీఎం దొంగల అరెస్టు

కార్డులు, సెల్‌ఫోన్‌లు స్వాధీనం : ఏసీసీ దేవేందర్‌రెడ్డి

హనుమకొండ టౌన్, జూలై 22: ఏటీఎం కేంద్రాల్లో డబ్బులు దొంగలించే ఇద్దరు దొంగలను హనుమకొండ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. హనుమకొండ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితులకు సంబంధించిన వివరాలను ఏసీపీ దేవేందర్‌రెడ్డి వెల్లడించారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఫతేపూర్‌కు చెందిన శుభం, ప్రియాంక అనే ప్రేమజంటకు బట్టలషాప్‌లో పనిచేసే శివవీర్ సింగ్, అనిశ్‌సింగ్, సత్యవీర్, ప్రియాంక సింగ్, ఓ మైనర్ పరిచయమయ్యారు. కిందటేడు నుంచి ఆంధ్రప్రదేశ్, నాగపూర్, చంద్రపూర్ తీసుకెళ్లి దొంగతనం ఎలా చేయాలో శుభం, అతడి ప్రియురాలు నేర్పించారు. తర్వాత హనుమకొండ, వరంగల్‌లో కెనరా, ఎస్‌బీఐతో కలిపి 6 ఏటీఎంలలో విడతల వారీగా రూ.25,500 దొంగలించారు. తాజాగా సోమవారం హనుమకొండలోని కెనరా బ్యాంకు ఏటీఎంను ధ్వంసం చేసి డబ్బులు దొంగలించేందుకు ప్రయత్నిస్తుండగా పక్కాసమాచారంతో హనుమకొండ పోలీసులు అక్కడికి వెళ్లి శివవీర్ సింగ్, అనిశ్‌సింగ్‌లతోపాటు ఒక మైనర్‌ను పట్టుకున్నారు. వీరి నుంచి దొంగలించడానికి వినియోగించిన సామగ్రి, రెండు ఏటీఎంలు, 3 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. కాగా ప్రధాన నిందితులు శుభం, అతడి ప్రియురాలు ప్రియాంకతో పాటు సత్యవీర్, ప్రియాంక సింగ్ పరారీలో ఉన్నారన్నారు. ఈ సమావేశంలో హనుమకొండ సీఐ మై.సతీష్, సీసీఎస్ సీఐ అబ్బయ్య, ఎస్సై సతీష్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏనుమాముల మార్కెట్ గ్రేడ్ -2 కార్యదర్శిగా అజిత్‌రావు



అజిత్ రావు

వరంగల్ వ్యవసాయం, జూలై 22: ఏనుమాముల(వరంగల్) వ్యవసాయ మార్కెట్ కమిటీ గ్రేడ్-2 కార్యదర్శిగా దన్నపునేని అజిత్ రావు బదిలీ అయ్యారు. ఇటీవల మార్కెటింగ్ శాఖ అధికారులు నిర్వహించిన సాధారణ బదిలీల్లో భాగంగా భువనగిరి వ్యవసాయ మార్కెట్ కార్యదర్శిగా పనిచేస్తున్న అజిత్‌రావును ఏనుమాముల మార్కెట్‌కు బదిలీ చేశారు. బదిలీ ఉత్తర్వులు అందగానే బాధ్యతలు చేపడుతానని అజిత్‌రావు తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన సూపర్‌వైజర్లు



మార్కెట్ కార్యదర్శి నిర్మలకు సూపర్‌వైజర్ల సత్కారం

మార్కెటింగ్‌శాఖ అధికారులు ఇటీవల నిర్వహించిన సాధారణ బదిలీల్లో భాగంగా వర్ధన్నపేట మార్కెట్ నుంచి చక్రబహదూర్ రాయ్, నెక్కొండ మార్కెట్ కమిటీ నుంచి అల్లి జ్యోతిప్రకాష్‌ను, నర్సంపేట మార్కెట్ నుంచి ఎండి.సలీంను అలాగే మేకల రజిత జేఎంఎస్‌ను ఏనుమాముల మార్కెట్‌కు బదిలీ చేశారు. కాగా, సోమవారం బదిలీపై వచ్చిన ముగ్గురు సూపర్‌వైజర్లను, ఒక జేఎంఎస్ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి పోలెపాక నిర్మలను మర్యాదపూర్వకంగా కలిసి బదిలీ ఉత్తర్వులను అందించారు. అనంతరం వారు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యదర్శి నిర్మలను సత్కరించారు. కార్యక్రమంలో గ్రేడ్ కార్యదర్శి రామోజు రాము, అసిస్టెంట్ సెక్రటరీలు రాజ్‌కుమార్, గందమల్ల రాజేందర్, సూపర్‌వైజర్లు నల్ల నర్సింగరావు, గంగాధర్, భూక్యా వెంకన్న నాయక్ పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైద్యులు

తెలంగాణ హెర్నియా సొసైటీ ఏర్పాటు

వరంగల్ మెడికల్, జూలై 22: కాకతీయ మెడికల్ కళాశాలలోని ఎన్ఆర్ఐక్యాంప్‌లో హెర్నియా సర్జన్స్ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెర్నియా సొసైటీ ఆఫ్ తెలంగాణ ఆవిర్భావం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో హెర్నియా సొసైటీ ఆఫ్ తెలంగాణ ఏర్పాటుకు కమిటీ చైర్మన్‌గా డాక్టర్ కూరపాటి రమేశ్‌ను సభ్యులు ఏకగ్రీవంగా నామినేట్ చేశారు. అనంతరం డాక్టర్ ఉమాకాంత్ గౌడ్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆధునిక లాపరోస్కోపీ సేవలు అందించడానికి డాక్టర్ కూరపాటి రమేశ్, ఇతర సభ్యులు బాధ్యత వహించి సేవలను విస్తత పర్చాలన్నారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో శిక్షణ కార్యక్రమాలు, వర్క్‌షాప్‌లు నిర్వహించడానికి ప్రణాళికలు సిద్ధం చేయాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సురేశ్ చంద్రహరి తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ కోటపై బహుజన జెండాను ఎగరవేయాలి

బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్

వడ్డెపల్లి, జూలై 22: బీసీలు ఆశించే స్థాయి నుంచి.. శాసించే స్థాయికి ఎదగాలనే సంకల్పంతో దేశమంతా బీసీ ఉద్యమాన్ని విస్తరించి, ఢిల్లీ కోటపై బహుజన జెండాను ఎగరవేసేందుకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ నేతృత్వంలో ఉద్యమాలు కొనసాగుతున్నాయని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్ అన్నారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ జనాభాలో 60శాతంపైగా ఉన్న బీసీలు.. విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాలలో ప్రాతినిధ్యం లేకపోవ డంతో అరశాతం ఉన్న అగ్రవర్ణాలు అధికారాన్ని అనుభవిస్తున్నాయన్నారు. బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లేందుకు ఆగస్టు7న ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పంజాబ్ రాష్ట్రం అమృత్‌సర్‌లోని గురునానక్ దేవ్ యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్‌లోగల ద గోల్డెన్‌జూబ్లీ సెలబ్రేషన్ హాల్‌లో అఖిల భారత జాతీయ ఓబీసీ 9వ మహాసభలను నిర్వహిస్తున్నామని బీసీ సమాజమంతా పాల్గొని విజ యవంతం చేయాలని వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ కోరారు. మహాసభకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపా ధ్యక్షుడు దాడి మల్లయ్య యాదవ్, రాష్ట్ర, జిల్లా నాయకులు బచ్చు ఆనందం, తాళ్ల సంపత్ కుమార్, కాసగాని అశోక్ గౌడ్, పంజాల మధు, దాడి రమేష్, కురిమిళ్ల శ్రీనివాస్, తాళ్లపెల్లి రమేష్, కడారి అనిల్, పంజాల జ్ఞానేశ్వర్‌గౌడ్ పాల్గొన్నారు.

న్యాయవాది శంకర్ ప్రసాద్‌రావుకు నివాళి



సంతాప కార్యక్రమంలో పాల్గొన్న న్యాయవాదులు

వరంగల్ లీగల్, జూలై 22: సీనియర్ న్యాయవాది కె.శంకర్‌ప్రసాద్‌రావు మృతికి హనుమకొండ, వరంగల్ బార్ అసోసియేషన్లు ఘనంగా నివాళులర్పించారు. సోమవారం వరంగల్ అంబేద్కర్ బార్ అసోసియేషన్ హాల్‌లో సంతాప కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈనెల 20న అనారోగ్యంతో మృతిచెందిన శంకర్ ప్రసాద్‌రావు హనుమకొండ పట్టణం అడ్వకేట్స్‌కాలనీకి చెందినవారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. 1995 నుంచి వరంగల్ జిల్లా కోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్నారు.

అంతకుముందు హనుమకొండ జిల్లా కోర్టు హాల్‌లో జిల్లా ప్రధానసెషన్స్ జడ్జి సీహెచ్.రమేష్‌బాబు ఆధ్వర్యంలో సంతాప కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా జడ్జి నిర్మల గీతాంబ, ఇరు జిల్లాలకు చెందిన అదనపు జిల్లా జడ్జిలు, సీనియర్, జూనియర్ సివిల్ జడ్జిలు, ప్రభుత్వ న్యాయవాది కె.నర్సింహరావు సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు. వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తీగల జీవన్‌గౌడ్ అధ్యక్షతన సంతాప కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మాతంగి రమేష్‌బాబు, ప్రధాన కార్యదర్శులు లాడే రమేష్, ముదసర్ అహ్మద్, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు భైరపాక జయాకర్, దుస్స జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఇంకా కళ్లల్లోనే ఆ పీడ కల

మోరంచపల్లిని ముంచేసిన వరదకు ఏడాది

- భారీగా వాటిల్లిన ప్రాణ, ఆస్తి, పంట నష్టం
- వరదల్లో ఐదుగురి గల్లంతు.. ముగ్గురి మృతదేహాలు లభ్యం
- ఇప్పటికీ దొరకని మరో ఇద్దరి ఆచూకీ
- ఆ కాళరాత్రినే తలుచుకుంటూ వణికిపోతున్న గ్రామస్థులు



గతేడాది వచ్చిన వరదతో మునిగిపోయిన మోరంచపల్లి గ్రామం (ఫైల్)

కృష్ణకాలనీ(భూపాలపల్లి), జూలై 22: మోరంచపల్లి... భూపాలపల్లి జిల్లా కేంద్రం సమీపంలోని జాతీయ రహదారికి ఆనుకుని ఉండే ఓ గ్రామం. ఆ ఊరికి వరద ఎలా ఉంటుందో ఎప్పుడు తెలియదు. కానీ, గతేడాది జూలై 27న అకస్మాత్తుగా భారీ వరద ఊరిని ముంచెత్తింది. క్షణాల్లో ప్రళయం అంటే ఎలా ఉంటుందో ఆ ఊరిజనాలకు ప్రత్యక్షంగా కళ్ల చూపింది. నాటి ఈ దుర్ఘటనలో మొత్తం ఐదుగురు గల్లంతవగా వారిలో ముగ్గురు మృతదేహాలు లభ్యమయ్యాయి. మరో ఇద్దరి ఆచూకీ ఇంకా లభ్యం కాలేదు. వందలాది పశువులు, పెంపుడు జంతువులు మృత్యువాత పడ్డాయి. నాటి పీడకలకు ఏడాది పూర్తి కావస్తున్న వేళ మరోసారి వర్షాలు, వరదలు ప్రారంభం కావడంతో ఆ గ్రామస్థులు మళ్లీ ఉలిక్కి పడుతున్నారు.

ఆ రోజు తెల్లవారుజామున..

ఇంకో గంటయితే తెల్లవారుతుందనేలోపే గ్రామాన్ని వరదనీరు చుట్టుముట్టింది. 2023 జూలై 26న మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షం కారణంగా గణపసముద్రంలోకి నీరు అధికమై మత్తడి పెరగడంతో మోరంచవాగులోకి వరద పెరిగి ఇళ్లలోకి చేరింది. 27న తెల్లవారుజామున 4గంటల సమయంలో వరద గ్రామానికి తాకింది. అది గ్రహించిన కొంత మంది గ్రామస్థులు.. కుందయ్యపల్లి, కర్కపల్లి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లారు. వరద ముప్పును అంచనా వేయలేకపోయిన వారు ఇళ్లలోనే ఉండిపోవడంతో నీళ్లన్నీ ఇళ్లను ముంచెత్తాయి. ఇళ్ల సజ్జల వరకు నీరు వేగంగా ప్రవహించింది. దీంతో ప్రాణాలు కాపాడుకునేందుకు చాలా మంది ఇళ్ల సజ్జలు, స్లాబులు, చెట్లపైకి ఎక్కారు. ఇదంతా పూర్తిగా తెల్లవారక సోషల్ మీడియా వేదికగా తమను కాపాడాలని బాధితులు ఫొటోలు, వీడియోలు షేర్ చేయడంతో వారి ఆర్తనాదాలు బహిర్గతమయ్యాయి. అప్పటికప్పుడు అధికార యంత్రాంగం రంగంలోకి దిగి.. సింగరేణి రెస్క్యూ, అగ్నిమాపక రెస్క్యూ సిబ్బంది చేరుకొని వరదల్లో చిక్కుకున్న సుమారు 150 మందిని బోటు సహాయంతో సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ విషయం సంచలనమైంది. అప్పటి ప్రభుత్వం, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చొరవతో రెండు ఆర్మీ హెలికాప్టర్లు గంటల వ్యవధిలో మోరంచపల్లి గ్రామానికి చేరుకున్నాయి. గ్రామం మీదుగా చుట్టూ ముట్టి పైనుంచి సమీక్షించారు. గ్రామానికి అతి దగ్గరగా ఆ ప్రాంతాన్నంతా పరిశీలించారు.

నాలుగు కుటుంబాల్లో విషాదం

భారీగా వచ్చిన వరదలు నాలుగు కుటుంబాల్లో విషాదాన్ని నింపాయి. వరద తాకిడి తట్టుకోలేక ఐదుగురు గల్లంతు అయ్యారు. గ్రామానికి చెందిన గొర్రె ఓదిరెడ్డి, వజ్రమ్మ, గంగిడి సరోజన, గడ్డం మహాలక్ష్మితోపాటు గ్రామంలోని శ్మశానవాటికలో తలదాచుకున్న ఓ గుర్తుతెలియని యాచకుడు కొట్టుకపోయారు. వారి కోసం రెస్క్యూ బృందం గాలించినా ఆ రోజు మృతదేహాలు దొరకలేదు. మరుసటి మూడు రోజుల వ్యవధిలో గడ్డం మహాలక్ష్మి, గుర్తుతెలియని యాచకుడు మినహా మిగిలిన ముగ్గురి మృతదేహాలు లభ్యమయ్యాయి. అయితే గడ్డం మహాలక్ష్మి.. భర్త శ్రీనివాస్ కళ్లారా చూస్తుండగానే కొట్టుకుపోవడం, ఎంత వెతికినా ఆమె ఆచూకీ దొరక్కపోవడం, కనీసం మృతదేహం కూడా లభ్యం కాకపోవడంతో ఆమె తిరిగొస్తుందన్న ఆశలు వదులుకున్న భర్త తన భార్య ఇక బతికి రావడం కష్టమేనని భావించి నెలవారీ మాసికాలు నిర్వహించడంతో పాటు ఈనెల 15న ఆమె సంవత్సరీకాన్ని కూడా జరిపించారు.

అపారనష్టం..

మోరంచవాగు వరద ఉధృతి గ్రామస్థులను అన్ని రకాల నష్టాలను చవిచూపింది. మూగ జీవాల మృత్యుఘోష వినిపించింది. గ్రామంలో ఉన్న మూగజీవాలు ఊపిరాడక 153 గేదెలు, 753 కోళ్లు, 3 దుక్కిటెద్దులు, 5 బాతులు మృతి చెందాయి. మరో 50 గొర్రెలు వరదలో కొట్టుపోయాయి. ఇక పంటలకు కూడా తీవ్ర నష్టం వాటిల్లింది. జిల్లా వ్యాప్తంగా 11 మండలాల్లో 25,181 ఎకరాలు నీట మునిగాయి. వీటితో పాటు 1800 ఎకరాల్లో ఇసుక మేటలు వేశాయి. వరి 13,290 ఎకరాలు, 11,891 ఎకరాల్లో పత్తి తీవ్రంగా నష్టాన్ని మిగిల్చింది. ఇక ఇళ్లలోని బియ్యం, దుస్తులు, మంచాలతో పాటు కూలర్, ఫ్రిజ్, టీవీ లాంటి ఎలక్ట్రానిక్ వస్తువులతో పాటు ఇళ్లలోని సామగ్రి మొత్తం తడిసిపోయాయి. అలాగే, ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు, ట్రాక్టర్లు వరదలో కొట్టుకుపోయి గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఆగిపోయి కనిపించాయి.

కొండంత కష్టం.. గోరంత సాయం..

మోరంచపల్లి గ్రామస్థులకు వచ్చిన కష్టానికి సరిపడా సాయం అప్పటి సర్కారు అందించలేదు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామం మునక వైరల్ అయింది. కానీ, ఈ విషయంపై అప్పటి సీఎం గ్రామం పేరును కూడా కనీసం ప్రస్తావించలేదన్న విమర్శలు వెల్లువెత్తాయి. ప్రభుత్వం తరుపున కేవలం రూ.10వేలు మాత్రమే అందించారు. అలాగే, సింగరేణి తరుపున కార్మికుల నుంచి కొంత మొత్తాన్ని జమ చేసి కుటుంబానికి రూ.15వేలు అందించారు. అప్పుడు ఎమ్మెల్యేగా ఉన్న ప్రస్తుత మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి సొంతంగా రూ.4వేల చొప్పున ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఉన్న ప్రస్తుత ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకులు, తాగునీటిని అందించారు. ఇక వివిధ కుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి తోచిన సహాయాన్ని చేశారు. అయినా వీరికి జరిగిన లోటును మాత్రం పావలా వంతు కూడా పూడ్చలేకపోయింది.



సాయం కోసం వచ్చిన హెలికాప్టర్

పరామర్శలకే పరిమితం?

వరద ఉధృతి మోరంచపల్లిని ముంచేసిందనే వార్త ఆ సమయంలో సంచలనంగా మారింది. సోషల్ మీడియాతో పాటు టీవీచానళ్లు, దినపత్రికలు బాధితులకు అండగా ఉండి వారి బాధలను బహిర్గతం చేశాయి. దీంతో వివిధ పార్టీల నేతలు మోరంచపల్లి బాట పట్టారు. నాడు రాష్ట్ర మంత్రిగా ఉన్న సత్యవతి రాథోడ్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ నేత ఈటల రాజేందర్, బీఎస్పీ నేతగా ఉన్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణమాదిగ, డీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహారాజ్ ఇల్లిల్లు తిరిగి బాధితులను పరామర్శించారు. కానీ, వారి కష్టాలను గట్టెక్కించేందుకు మేమున్నామనే భరోసానివ్వలేకపోయారన్న విమర్శలు వ్యక్తమయ్యాయి.

గండి పడిన చెరువులకు మరమ్మతులు

గతేడాది వరదలకు ప్రధానంగా వర్షపాతం అధికంగా నమోదు కావడం ఓ కారణమైతే.. ఇదే తరుణంలో గణపురం మండలం ధర్మరావుపేట చెరువు, వెంకటాపూర్ మండలం బూర్గుపేట చెరువులకు గండిపడటంతో ఈ వరద ముంచెత్తింది. మరోవైపు ఇదే సమయంలో గణపసముద్రంలోకి 22 అడుగులకు ఉండాల్సిన నీటి మట్టం ఒక్కసారిగా 33 అడుగులకు పెరిగి ఉప్పొంగడంతో ఈ సమస్య తీవ్రతరమైంది. అయితే, గతంలో జరిగిన ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలో భాగంగా చెరువుల మరమ్మతు పనులను సైతం చేపట్టింది. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు నేతృత్వంలో ధర్మరావుపేట ఊర చెరువుకు రూ.1కోటి 70లక్షలు వెచ్చించి పనులు చేపట్టారు. వెంకటాపురం మండలం బూర్గుపేట చెరువుకు సైతం గండి పడకుండా పకడ్బందీ మరమ్మతులు చేశారు. అయినప్పటికి గ్రామస్థులను మాత్రం ఆ భయం వీడకపోవడం శోచనీయం.



అధిక వరద తాకిడికి తెగిపోయిన జాతీయ రహదారి (ఫైల్)

కూలీలతో వెళుతున్న ట్రాక్టర్ బోల్తా

15 మందికి స్వల్ప, నలుగురికి తీవ్ర గాయాలు ● సముద్రాలలో ఘటన



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కత్తుల వెంకటమ్మ, ఎలబోయిన అరుణ

స్టేషన్‌ఘన్‌పూర్, జూలై 22: నాట్లు వేయడానికి 25 మంది కూలీలతో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తా పడింది. దీంతో 15మందికి స్వల్పంగా, మరో నలుగురికి తీవ్రంగా గాయాలయ్యాయి. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సముద్రాల గ్రామానికి చెందిన నేరేళ్ల రాజు అనే రైతు పొలంలో వరినాట్లు వేసేందుకు 25 మంది కూలీలను ట్రాక్టర్‌లోకి ఎక్కించాడు. అంతకుముందే పొలంలో చల్లడానికి 16 పిండిబస్తాలను లోడ్ చేసుకున్నాడు. రాజు కుమారుడు అరవింద్ ట్రాక్టర్ నడుపుతున్నాడు. మట్టిరోడ్డు మీదుగా వెళుతుండగా దారిలో బురదగుంటలో టైర్లు దిగబడ్డాయి. డ్రైవర్ ట్రాక్టర్‌ను ముందుకు నడిపే క్రమంలో ట్రాలీ ఒక్కసారిగా పక్కకు ఒరిగింది. దీంతో కూలీలు పక్కనే ఉన్న బురద పొలంలో ఒకరిపై ఒకరు పడడంతో పాటు వారి పైన పిండి బస్తాలు పడ్డాయి. చుట్టు పక్కల వారు వచ్చి ట్రాలీని పైకి లేపారు. గాయపడిన వారిని ఆటోలలో ఘన్‌పూర్ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వారిలో ఎలబోయిన అరుణ, కత్తుల వెంకటమ్మ, కన్నెబోయిన యశోద, రుద్రపు రజితలకు తీవ్రగాయాలు అయ్యాయి. కట్ల లక్ష్మి, ఐత హైమా, కన్నెబోయిన రమ, కత్తుల అనూషా, ఐత లక్ష్మి, బత్తుల హైమ, కట్ల దివ్య, కట్ల మానస, మరికొందరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఎస్సై నాగరాజు ఆస్పత్రి వద్దకు వచ్చి ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. అవగాహన లేకుండా డ్రైవర్ డ్రైవింగ్ చేయడం వల్లనే ప్రమాదం జరిగిందని అన్నారు.

కోమల్ల హెచ్‌ఎంను బదిలీ చేయాలి

రఘునాథపల్లి, జూలై 22: ఉపాధ్యాయులతో పాటు విద్యార్థుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్న కోమల్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.నర్సింహులును తక్షణమే బదిలీ చేయాలని కోరుతూ కోమల్ల గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు కలెక్టర్ రిజ్వాన్ బాషాకు సోమవారం వినతి పత్రం సమర్పించారు. వారిలో తాటికొండ వెంకటేష్, బొల్లపల్లి కుమార్, బంద కుమారస్వామి ఉన్నారు.

బండి సంజయ్‌ని కలిసిన మాదాసు



కేంద్ర మంత్రి బండి సంజయ్‌ని కలిసిన మాదాసు వెంకటేష్

స్టేషన్‌ఘన్‌పూర్, జూలై 22: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌ని ఢిల్లీలోని ఆయన కార్యాలయంలో సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాదాసు వెంకటేష్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. రానున్న రోజుల్లో ఘన్‌పూర్‌లో బీజేపీ బలోపేతానికి కృషి చేయాలని ఈ సందర్భంగా సంజయ్ మదాసుకు సూచించారు. తాను పాదయాత్ర చేబట్టిన సందర్భంలో ఘన్‌పూర్ నియోజకవర్గంలో తనకు మద్దతుగా నిలబడి యాత్ర విజయవంతానికి కృషి చేసిన మాదాసుకు పార్టీలో సముచిత స్థానం కల్పిస్తానని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నేత సుబ్బారావు పాల్గొన్నారు.

వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

బచ్చన్నపేట, జూలై 22: రాష్ట్ర ప్రభుత్వం వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఆదుకోవాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు శివరాత్రి రాజు కోరారు. సోమవారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వడ్డెర కులస్థులు రాళ్లు కొట్టడమే జీవనాధారంగా బతుకుతున్నారని, రెక్కాడితేగాని డొక్క నిండని పరిస్థితిలో జీవనం వెల్లదీస్తున్నారని అన్నారు. వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చటంతో పాటు, కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. సమావేశంలో పలు గ్రామాల వడ్డెరలు పాల్గొన్నారు.

వర్షానికి కూలిన ఇళ్లు



కేశిరెడ్డిపల్లిలో కూలిన ఇల్లు

బచ్చన్నపేట, జూలై 22: గత మూడు రోజులుగా కురిసిన వర్షానికి మండలంలోని కేశిరెడ్డిపల్లి గ్రామంలో రెండు ఇళ్లు కూలిపోయాయి. నలగొప్పుల ఏశవ్వ అనే మహిళ రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా ఒకవైపు ఇంటి పైకప్పు కూలిపోయింది. అదృష్టవశాత్తు ఆమెకు ఎలాంటి గాయాలు కాకుండా బయటపడింది. అలాగే అజయ్ అనే రైతు పెంకుటిళ్లు కూలింది. తమను ఆదుకోవాలని రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందించినట్టు తెలిపారు.

అంగన్‌వాడి సెంటర్లో సామూహిక అక్షరాభ్యాసం

కొడకండ్ల జూలై 20 : మండలంలోని పాకాల అంగన్‌వాడి సెంటర్ 1లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సోమవారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించి చిన్నారులకు పలకలు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక పంచాయతీ కార్యదర్శి కోట బయ్యన్న, అంగన్‌వాడి టీచర్ జె.సుకన్య, సెంటర్ 2 టీచర్ ఎన్.శ్రీలత,హెల్పర్ భారతి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



రఘునాథపల్లిలో తహసీల్దార్ యుగేందర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న బీజేపీ నాయకులు



పాలకుర్తిలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు



జనగామలో తహసీల్దార్ వెంకన్నకు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు



చిలుపూర్‌లో తహసీల్దార్ సరస్వతికి వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

బీసీ రిజర్వేషన్లు పెంచాలి

- కాలయాపన చేస్తే సహించేది లేదు
- తహసీల్దార్ కార్యాలయాల వద్ద బీజేపీ నేతల ధర్నా
- అనంతరం వినతిపత్రాల అందజేత

జనగామ రూరల్, జూలై 22: బీసీ రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నాయకులు సోమవారం జనగామ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ వెంకన్నకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ ఓబీసీ మండల అధ్యక్షుడు రమేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు బీసీ రిజర్వేషన్లు 23 నుంచి 42 శాతానికి పెంచుతామని హామీ ఇచ్చి ఇంతవరకు పెంచలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే రెండో దశ గొర్రెల పంపిణీకి సంబంధించిన రూ. 2లక్షలను లబ్ధిదారుల అకౌంట్లో జమ చేస్తామని చేయలేదని, బీసీ సబ్‌ప్లాన్ ఏర్పాటు చేసి యేడాదికి రూ.20 కోట్లు నిధులు విడుదల చేస్తామని చెప్పి ఇంతవరకు చేయలేదని అన్నారు. వెంటనే కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ నేరవేర్చాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు వారణాసి పవన్ శర్మ, మహేష్, కాసుల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

చిలుపూర్: రాష్ట్ర ప్రభుత్వం సాధారణ ఎన్నికలకు ముందు బీసీలకు ఇచ్చిన హామీ మేరకు తక్షణమే బీసీ రిజర్వేషన్లను పెంచేందుకు కార్యాచరణ రూపొందించాలని బీజేపీ ఓబీసీ మోర్చా జనగామ జిల్లా ఇన్‌చార్జి ముంగి ధనుంజయ్ డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు ఆ పార్టీ శ్రేణులతో కలిసి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దార్ సరస్వతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ధనుంజయ్ మాట్లాడుతూ, బీసీ రిజర్వేషన్ల పెంపు విషయంలో ప్రభుత్వం కాలయాపన చేస్తే సహించేది లేదన్నారు. పార్టీ ఓబీసీ మోర్చా మండలాధ్యక్షుడు ఊరడి రాజు నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బాల్నె శ్రీనివాస్ గౌడ్, మండలాధ్యక్షుడు గంటె ఉపేందర్ యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి తోట శ్రీనివాస్, వేల్పుల సంపత్, వెలిశాల శ్రీనివాస్, పెండ్యాల దిలీప్, సాదం భీమన్న, వేణు, దోరం శ్రీనివాస్, సాదం రామరాజు, మారబోయిన రమేష్, కాదుకాయ రమేష్, తోట రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

రఘునాథపల్లి: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ బీజేపీ నాయకులు సోమవారం తహసీల్దార్ పురం యుగేందర్‌కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పుప్పాల వేణుకుమార్, కావటి ముత్యాలు, మంద వెంకటేషం యాదవ్, దైతల రంజిత్, గాదె ఉపేందర్, బోల్ల రాజ్‌కుమార్, ద్యావర రాజు, మల్క్యపురం శ్రీకాంత్, పొన్నాల అంజనేయులు, కట్ట రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పాలకుర్తి: కుల గణన చేసి బీసీ రిజర్వేషన్లు పెంచేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట భారతీయ జనతా పార్టీ నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు దొంగరి మహేందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే బీసీ కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. బీసీ కమిషన్ నివేదిక ఆధారంగా బీసీ రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేశారు. బీసీలకు సబ్‌ప్లాన్ తగిన నిధులు మంజూరి చేసి అసెంబ్లీలో చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు దుంపల సంత్, కమ్మగాని శ్రీకాంత్, వేల్పుల దేవరాజ్, సోమేశ్వర్, పబ్బ సంతోష్, సమ్మయ్య చారీ. కొడిశాల యాదగిరి, లాకావత్ రవి, వినయ్, బత్తోజు శ్రవన్ ఉన్నారు.

తరిగొప్పుల: బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని కోరుతూ భారతీయ జనత పార్టీ మండలాధ్యక్షుడు ఆవుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో బీసీ మోర్చ మండలాధ్యక్షుడు మ్యాడల రాజు సోమవారం తరిగొప్పుల తహసీల్దార్ కిషన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెనుకబడిన కులాల సమగ్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రతీ కులానికి ఓ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలలో జనాభ ప్రాతిపదికన రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు జీల సతీష్ యాదవ్, ఎడెల్లి రాంనర్సింహారెడ్డి, తలకొక్కుల శ్రీనివాస్, పెద్దబోయిన రాజు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

● అధికారులకు కలెక్టర్ రిజ్వాన్ బాషా ఆదేశాలు

జనగామ రూరల్, జూలై 22: రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ఆయన అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్‌తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజావాణిలోని అర్జీలను వెంటనే పరిష్కరించాలన్నారు. రైతుల రుణమాఫీ డబ్బులు వారి ఖాతాల్లోకి జమ అయ్యేలా చూడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను పూర్తి స్థాయిలో ప్రజల్లోకి తీసుకు వెళ్లాలన్నారు. ప్రతీ బుధవారం అంగన్వాడి కేంద్రాల సందర్శన, గురువారం పాఠశాలల తనిఖీలు, మంగళవారం డ్రై డే నిర్వహించాలని, శుక్రవారం మొక్కల సంరక్షణకు వాటరింగ్ డే నిర్వహించాలని అన్నారు. ప్రజాపాలన సేవా కేంద్రాన్ని కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేశామని ఏమైన సమస్యలు ఉంటే వినియోగించుకోవాలని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

ఫీజులను నియంత్రించాలంటూ వినతి..

జిల్లా కేంద్రంలోని సెయింట్ మేరీస్ హైస్కూల్‌లో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని, వాటిని నియంత్రించాలని కోరుతూ బీజేవైఎం నాయకులు సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. వారిలో బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి చింతకింది సంతోష్ ఉల్లెంగుల రాజు, అభినయ్, కార్తీక్, తదితరులు ఉన్నారు.

రోడ్లపై గుంతల పూడ్చివేత



గుంతలను పూడ్చివేయిస్తున్న పోలీసులు

జనగామ రూరల్, జూలై 22: జిల్లా కేంద్రంలోని ప్రధాన రోడ్లపై గుంతలు పడటంతో జనగామ పోలీసులు సోమవారం వాటిని పూడ్చివేయించారు. ఈ సందర్భంగా జనగామ ఎస్సై తిరుపతి మాట్లాడుతూ కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు జిల్లా కేంద్రంలో ప్రధాన రోడ్డు గుంతలు పడటంతో వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా ఆర్అండ్‌బీ అధికారుల సహకారంలో సిమెంట్, కాంక్రీట్‌తో గుంతలను పూడ్చివేశామన్నారు. వర్షాకాలంలో గుంతలో నీరు నిలిచి రోడ్డు ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉన్నందున వాహనాలను జాగ్రత్తగా నడపాలన్నారు.



జఫర్‌గడ్ ఆదర్శ పాఠశాలలో బాల కవిసమ్మేళన విజేతలకు బహుమతులను అందిస్తున్న ఉపాధ్యాయులు

గొప్ప దార్శనికుడు దాశరథి

జయంతి సందర్భంగా కొనియాడిన వక్తలు

జఫర్‌గడ్, జూలై 22 : అన్యాయాల్ని ఎదిరించి.. సామాన్య ప్రజల కోసం కలాన్ని గళంగా మార్చిన యోధుడు దాశరథి కృష్ణమాచార్య గొప్ప దార్శనికుడని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ దేవులపల్లి శ్రీకాంత్ కొనియాడారు. దాశరథి జయంతి కార్యక్రమాన్ని సోమవారం తెలుగు విభాగం ఆధ్వర్యంలో ఆదర్శ పాఠశాలలో నిర్వహించారు. దాశరథి చిత్ర పటానికి ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వక్తలు మాట్లాడుతూ దాశరథి 'నా తెలంగాణ కోటి రతనాల వీణ' అంటూ ఎలుగెత్తి నిజాం పాలకులు, రజాకార్ల అరాచకాలను ఎదిరించిన మహనీయుడుగా పేర్కొన్నారు. తన కవితల ద్వారా పీడిత ప్రజల పక్షాన నిలిచారన్నారు. రచనలతో తెలంగాణ ప్రజల గొంతుకగా నిలిచి తెలంగాణ బిడ్డల్లో ఉద్యమ స్ఫూర్తిని నింపిన మహాకవి దాశరథి అని కొనియాడారు.

అలరించిన బాల కవి సమ్మేళనం..

కాగా, దాశరథి జయంతి పురస్కరించుకుని ఆదర్శ పాఠశాలలో బాల కవి సమ్మేళనం నిర్వహించారు. డాక్టర్ మహేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమ్మేళనంలో బాలబాలికలు దాశరథిని స్మరిస్తూ పాటలు, కవితలు, పద్యాలు పాడి వినిపించారు. విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు డాక్టర్ జానీనాయక్, నాగలక్ష్మీ, భూక్య నరేశ్, కిరణ్‌కుమార్, కందగట్ల గణేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

‘లయన్స్’ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ



రఘునాథపల్లిలో అన్నప్రసాద వితరణ చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

రఘునాథపల్లి, జూలై 22: రఘునాథపల్లి బస్‌స్టేషన్ ఆవరణలో లయన్స్ క్లబ్ ఆఫ్ రఘునాథపల్లి స్టేషన్ సభ్యుడు కూరెళ్ల వినయ్‌కుమార్ జన్మదినం సందర్భంగా సోమవారం అన్నప్రసాద వితరణ నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ కూరెళ్ల పెద్దఉపేందర్, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కందుల అనిల్‌కుమార్, కర్మికొండ ప్రదీప్ కుమార్, కోశాధికారి కోళ్ల రాజుగౌడ్, శంకర్ రెడ్డి, వేదకుమార్, లక్ష్మణ్, కడారి శ్రీనివాస్, రహీం పాష, దుద్దిల్ల రాజేందర్, సురేష్, కరుణాకర్, అశోక్, బచ్చు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్య సాధనకు పాటుపడాలి



శివునిపల్లి హైస్కూల్‌లో మాట్లాడుతున్న మోటివేటర్ బాబు

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, జూలై 22: విద్యార్థులు పాఠశాల దశలోనే లక్ష్యం నిర్దేశించుకుని దాన్ని సాధించుకోడానికి పాటుపడాలని ఇంపాక్ట్ మోటివేటర్ కేడీజీ బాబు అన్నారు. సోమవారం శివునిపల్లి హైస్కూల్‌లో 8,9,10 తరగతుల విద్యార్థులకు నిర్వహించిన అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడారు. లక్ష్యం చేరుకోవాలంటే విద్యార్థులు మొదట విద్యార్థులు పనికి రానివి విడిచి పెట్టాలన్నారు. అతి నిద్ర, సోమరితనం, అశ్రద్ధ, సినిమాలు, క్రికెట్, సీరియళ్లు చూడడం, చాటింగ్, సెల్ ఫోన్ అన్ని వదిలేయాలన్నారు. ఇవన్నీ మన ప్రగతిని అడ్డుకునేవే అన్నారు. విద్యార్థులు మనకు ఏమీ చేయని సినిమా హీరో, హీరోయిన్‌లను అభిమానించడం మానాలని, మనలను పెంచి పెద్ద చేస్తున్న తల్లిదండ్రులను అభిమానించాలని అన్నారు. పేరెంట్స్ మన రియల్ హీరోలన్నారు. చెడును వదిలి, మంచి వైపు మారడానికి విద్యార్థులు ప్రయత్నించాలన్నారు. సమావేశానికి హెచ్‌ఎం కె.రమేశ్ అధ్యక్షత వహించగా ఉపాధ్యాయులు కె.ప్రవీణ్, టి. శ్రీనాథ్, శ్రీనికాంత్, యాదగిరి, శర్మ, రాధాకృష్ణ, రవి, యాదగిరి, లక్ష్మీప్రసాద్, సర్వర్ పాష, ఫకీర్‌దాసు, వసంత కుమారి, కృష్ణవేణి, నళినీబాయి, సురేఖ, అ రుణ, జ్యోతి జానకి తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయంలో శ్రవణ నక్షత్రహోమం

భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తులు



స్వామివారి కల్యాణం, శ్రవణ నక్షత్ర హోమం జరిపిస్తున్న పూజారులు

చిలుపూర్, జూలై 22 : శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని చిలుపూర్ గుట్ట బుగులు వెంకన్న దేవాలయంలో ఘనంగా హోమపూజ నిర్వహించారు. సోమవారం ఆలయ ఆవరణలో జరిగిన మాస పూజా కార్యక్రమానికి భక్తులు పెద్దసంఖ్యలో హాజరు కాగా, ప్రధాన అర్చకుడు బ్రాహ్మణపల్లి రవీందర్ శర్మ, పూజారులు సౌమిత్రి రంగాచార్యులు, కృష్ణమాచార్యుల వేదమంత్రాల మధ్య ఉత్సవమూర్తులకు కల్యాణం జరిపించారు. అనంతరం భక్తులకు శేష వస్త్రాలతో పాటు, తీర్థప్రసాదాలను ఉచితంగా అందజేశారు. అనంతరం భక్తుల సహకారంతో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఈవో లక్ష్మీప్రసన్న, జూనియర్ అసిస్టెంట్ ఆడెపు రమేష్, రికార్డ్ అసిస్టెంట్ వీరన్న, గాదె రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో పురుగులు

ధర్మసాగర్, జూలై 22: మండల కేంద్రంలోని బాలికల పాఠశాలలో సోమవారం మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు వడ్డిస్తున్న క్రమంలో ఓ విద్యార్థికి అన్నంలో పురుగు కనిపించింది. దీంతో విద్యార్థి భయాందోళనకు గురై తోటి విద్యార్థులకు తెలిపారు. దీంతో విద్యార్థులు ఒకరి తర్వాత ఒకరి తినే అన్నాన్ని కింద పడేశారు. ఈ విషయంపై ప్రధానోపాధ్యాయుడు మురళిని వివరణ కోరగా ఒక విద్యార్థికి మాత్రమే అన్నంలో పురుగు వచ్చిందని, ఇక ముందు రాకుండా చూస్తామని అన్నారు.

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి

ఐనవోలు, జూలై 22: జూన్ 28 వరకు కొత్తగా పట్టాదార్ పాస్‌పుస్తకాలు వచ్చిన రైతులతోపాటు గతంలో పేర్లు నమోదు చేసుకోని వారు ఆగస్టు 5 వరకు రైతు బీమా చేయించుకోవాలని ఏవో ఆడెపు కవిత సూచించారు. అదేవిధంగా బీమా పత్రంలో ఎవరైనా మార్పులు చేర్పులు ఉంటే ఈనెల 30లోగా చేసుకోవాలన్నారు. బీమా కావాల్సిన రైతులు పట్టాదార్ పాస్‌పుస్తకం, రైతు ఆధార్‌కార్డు, నామిని ఆధార్‌కార్డు దరఖాస్తు ఫారాలను నింపి సమీప ఏఈవోలకు అందజేయాలని సూచించారు.

పాఠశాలనా.. పాడుపడిన భవనమా?

- అధ్వానంగా తయారైన నమిలిగొండ పాఠశాల
- పనులు చేసిన కొద్ది రోజులకే కారుతున్న వర్షం నీళ్లు
- నెలలు గడుస్తున్నా పూర్తి చేయని పనులు
- ఇబ్బందిపడుతున్న విద్యార్థులు

స్టేషన్‌ఘన్‌పూర్, జూలై 22: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలనే ఉన్నతమైన లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళుతుంటే కాంట్రాక్టర్లు, అధికారులు సర్కారు లక్ష్యాన్ని నీరుగారుస్తున్నారు. ఓ వైపు విద్యార్థులు లేక ప్రభుత్వ పాఠశాలలు మూతబడుతుంటే పిల్లలున్న చోట పాఠశాలల్ని ఎవరూ పట్టించుకోవడం లేదు. స్టేషన్‌ఘన్‌పూర్ మండలం నమిలిగొండ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రస్తుతం అదే పరిస్థితి నెలకొంది. తమ పిల్లల్ని పంపిస్తున్నప్పటికీ పాఠశాల నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మన ఊరు -మనబడి కార్యక్రమంలో భాగంగా 2023-24 విద్యాసంవత్సరంలో పాఠశాలలో పలు అభివృద్ధి పనులకు గాను ప్రభుత్వం రూ.22లక్షలు కేటాయించింది. వాటితో పాఠశాల స్టాఫ్‌రూమ్ పక్కన గల 5వ, 2వ తరగతి గదులు వర్షాలు కురిసినప్పుడు స్లాబ్ నుంచి నీళ్లు కారుతున్నందున స్లాబ్‌కు కొన్ని నెలల క్రితం కాంట్రాక్టర్ తూతూమంత్రంగా పనులు పూర్తి చేతులు దులుపుకున్నాడు. ప్రస్తుతం వరుసగా కురుస్తున్న తుఫాన్‌తో ఫ్లోరింగ్ చేసిన గదుల స్లాబ్ నుంచి తరగతి గదుల్లోకి నీళ్లు చేరుతున్నాయి. దీంతో విద్యార్థులు గదుల్లో కూర్చునే పరిస్థితి లేకుండా పోయింది. అదేవిధంగా 6వ, 7వ తరతగతి గదులకు సబంధించిన స్లాబ్ పూర్తిగా దెబ్బతినడంతో స్లాబ్‌ను కూల్చిచేసి కొత్తస్లాబ్ వేశారు. కాని ఆరు నెలలు గడుస్తున్నా గదుల్లో పేయింట్ వేయకుండా వదిలేయడంతో గదులు దిరిద్రంగా తయారయ్యాయి. కూల్చిన వ్యర్థాలను కాంట్రాక్టర్ తొలగించకపోవడంతో పాఠశాల పరిసరాలు అధ్వానంగా మారాయి. తరగతి గదుల అన్నింటికీ కిటికీలు, తలుపులు, ఇతరత్ర మరమ్మతులు చేయాల్సి ఉన్నా కంట్రాక్టర్ ఏ ఒక్క పని చేయకుండా అలాగే వదిలేశాడు. అధికారులు ఇప్పటికైనా మేలుకొని పాఠశాలలో మరమ్మతు పనులు పూర్తి చేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



తరగతి గది ముందు పడవేసిన బండలు, పెచ్చులు



పెయింట్ వేయకుండా వదిలేసిన తరగతిగది



తరగతిగదిలోకి ఇంకిన నీరు, తడిసిన గోడలు చూపుతున్న చిన్నారులు

పాఠశాలను కలెక్టర్ సందర్శించాలి..



గాదె రాజు, నమిలిగొండ గ్రామస్థుడు

మా ఊరి పాఠశాలను కలెక్టర్ సందర్శించాలి. పాఠశాల దుస్థితిపై విచారణ జరిపించాలి. విద్యార్థులకు మేలు చేయాలి. తరగతి గదుల్లో వర్షం నీళ్లు కురుస్తుండంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే మరమ్మతులు చేయించాలి. ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తామని సీఎం చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో అమలు కావడంలేదు.